

# ఎందుకే నీకింత తొందరా...

## - బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

**గేరీతో** నా స్నేహం అలా పెరుగుతూ వచ్చింది. చిన్నచిన్న స్కిట్స్ రాయమని మాకు ఎసైన్‌మెంట్ ఇస్తే, నేను నా భారతీయ రూట్స్ గురించి రాస్తే గేరీ దానిని డెవలప్ చేసి, స్క్రీన్‌ప్లే ఎలా రాయాలో నాకు చెప్పేవాడు.

ఓ ఆదివారం నన్ను యూనివర్సల్ స్టూడియోస్‌కి తీసుకెళ్ళాడు. అతను ఎంతగా అల్లరి చేస్తాడో అంతగా గంభీరంగా ఆలోచించగలడు. అమ్మ ఇతని తండ్రితో కలిపి ఇంకో ఇద్దర్ని పెళ్ళాడి డివోర్స్ తీసుకుందిట. ప్రస్తుతం డ్రగ్ రిహాబ్ సెంటర్‌లో వుందిట. ఇతనికి ఓ స్వంత తమ్ముడూ, ఇద్దరు హాఫ్ సిస్టర్స్ వున్నారు. విచిత్రంగా ఇతని తల్లిని డివోర్స్ చేసిన ఇద్దరు భర్తలూ ఇతనితో బాగానే మాట్లాడ్తారు. ఇతని తమ్ముడు మాత్రం కష్టపడి చదువుకుని, ఓ చిన్న ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఇతనికి డబ్బు పంపిస్తున్నాడుట. ఇక్కడ మా ఇద్దరికీ పోలిక వుంది. అన్నదమ్ముల మధ్య అనుబంధం వుండడం నాకు నచ్చింది. ఇతను ఓ పిలిప్పీన్స్ అమ్మాయితో గత రెండేళ్ళుగా కలిసి వుండి, ఈ మధ్యే బ్రేకప్ చెప్పానని చెప్పాడు.

"ఎందుకు" అని అడిగితే "ఆమె నాకన్నా ధనవంతుడినీ, ప్రయోజకుడినీ పెళ్ళాడడానికి ఇష్టపడింది" అని నవ్వుతూ చెప్పాడు.

"నీకు బాధ వెయ్యలేదా?" అని కుతూహలంగా అడిగాను.

"నో... ఐ యామ్ హాపీ ఫర్ హర్" అన్నాడు.

నేను చాలా ఆశ్చర్యపోయాను.

"ఆమె చాలా మంచిది. షీ డిజర్వ్స్ మోర్ అని నాకు తెలుసు" అన్నాడు.

చాలా ఆశ్చర్యపోయాను.

ఈనాటికీ ప్రేమించిన వాడిని కాకుండా, ఇంకో ధనవంతుడైన వ్యక్తిన వ్యక్తిని చేసుకుంటే, ఆడపిల్లని విలనీగా దృశ్యీకరించే సినిమాలు మనకింకా వస్తూనే వున్నాయి.

"మీరిద్దరూ కలిసి వున్నప్పుడు, పెళ్ళి చేసుకోవాలి, పిల్లల్ని కనాలి అని మాట్లాడుకోలేదా?" అడిగాను.

"మాట్లాడుకున్నాం. నేను ఒక బేకరీలో ఉద్యోగంలో చేరాను ఆమెని పెళ్ళి చేసుకోడానికి. ఆమెని ప్రపోజ్ చెయ్యడానికి రింగు కొనుక్కుని ఇంటికి వచ్చిన రోజే డ్రమటిక్‌గా ఆమె నన్ను వదిలి వెళ్తున్నాననీ, ఆమె బాస్‌ని పెళ్ళి చేసుకోబోతున్నాననీ చెప్పింది" అన్నాడు.

"నీ హార్ట్ బ్రేక్ కాలేదా?" అడిగాను.

"ఒక వారం రోజులు బాధపడ్డాను. నా తమ్ముడు మియామీనుండి వచ్చి, "నీకిష్టమైన చదువు చదువుకో, సినిమాలు అంటే నీకు ఇష్టం కదా! అని నన్ను ఈ స్కూల్లో చేర్పించాడు" అన్నాడు.

చాలా స్వచ్ఛంగా నవ్వుతున్న అతన్ని ఆశ్చర్యంగా చూసాను.

నా బ్రేకప్ లోకానికే ఏదో వినాశనంలా గంటలు గంటలు దిండు తడిసిపోయేట్లు నేను ఏడవడం తలచుకున్నాను.

అదే మాట అతనితో అన్నాను.

"నువ్వు కొన్ని రోజులే బ్రతుకుతావ్ యువర్ టైం స్టార్ట్స్ నౌ" అని డాక్టర్ చెప్పినప్పుడు కూడా అలా ఏడ్వనవసరం లేదు. మిగిలిన కాలం ఆనందంగా గడపాలి. ఎవరూ శాశ్వతంకాదు" అన్నాడు గేరీ.

"ఇంత లైట్‌గా తీసుకుంటారా మీరు?" అడిగాను.

"అమ్మ నా తండ్రిని వదిలేసినప్పుడు ఇలాగే బాధపడింది. రెండవసారి సంతోషంగా వుంటానని మళ్ళీ పెళ్ళాడింది. అతని వ్యసనాలవల్ల గొడవలు.. వదిలేసాక మూడవసారి ఎంతో నమ్మకంగా  పెళ్ళాడింది. ఇతనూ ఇంకొక అమ్మాయిని ఇష్టపడ్తున్నా.. విడిపోదాం అని చెప్పినప్పుడు, బాధని భరించలేకపోయింది. ఈలోగా డ్రగ్ ఎడిక్ట్ అయింది. సో.. ప్రేమవల్ల జీవితం దుర్భరమవుతుందని, దాన్ని సీరియస్‌గా తీసుకోకూడదనీ, ప్రాక్టికల్‌గా తెలుసుకున్నాను" అన్నాడు.

ఎవరైనా వాళ్ళు పెరిగిన వాతావరణం కుటుంబం వల్లే ప్రభావితం అయి డెసిషన్స్ తీసుకుంటారు. ద్వారక కూడా అదే చేసాడు అనిపించింది.

గేరీ ఒకసారి "నువ్వు మీ దేశం వెళ్ళి పెద్ద రైటర్‌వో, డైరెక్టర్‌వో అయితే, నాకు పని ఇస్తావా?" అని అడిగాడు.

"నువ్వు హాలివుడ్‌లో పెద్ద దర్శకుడివి అయితే, నన్ను నీతో పని చేయనిస్తావా?" అడిగాను.

"ష్యూర్" అన్నాడు.

"మాటిచ్చి తప్పకూడదు" అన్నాను.

నవ్వి "పెళ్ళి విషయంలో తప్ప దేనిలోనూ మాట ఇస్తే తప్పను" అన్నాడు.

ద్వారక మళ్ళీ గుర్తొచ్చాడు.

కమిట్‌మెంట్ అంటే భయం అతనికి కూడా.

గేరీతోపాటు అతని ఫ్రెండ్స్ డోరతీ, జోహాన్ అనే అతని ఫ్రెండ్స్ కూడా పరిచయం అయ్యారు.

రూం మేట్ బాధ మాత్రం చాలా ఎక్కువైంది అస్సలు స్నేహంగా వుండదు నీనా. ఎందుకో నేను వెళ్ళిపోతే బావుండునని చూస్తుందేమో అనిపిస్తుంది.

"ఈరోజు మా డేట్ నైట్. ఇవాళ లేట్‌గా రా ఇంటికి" అంది ఒకసారి.

నేను సరేనని గేరీతో మూవీకి వెళ్ళాను. లేట్‌గా వచ్చి, తాళం తీసుకుని లోపలికి వెళ్తే, నా బెడ్‌మీద వున్నారు ఆమె, ఆమె బోయ్ ఫ్రెండ్. అందుకు గిల్టీగా ఫీల్ అవకుండా, "నీకు మేనర్స్ లేదా? చెప్పాను కదా లేట్‌గా రమ్మని" అని నామీద అరిచింది.

ఆమె బోయ్ ఫ్రెండ్ "సారీ" అన్నాడు నాతో.

నేను అతని వైపు చూడలేదు.

"నా బెడ్ వాడడం నాకు నచ్చలేదు" అన్నాను.

"అసలు నువ్వే నాకు నచ్చలేదు రూం ఖాళీ చెయ్యి" అరిచింది నీనా.

ఆంటీ, వివేకానందా అంకుల్ గుర్తొచ్చారు. కాని ఇంగితం వెన్ను తట్టింది. హాయిగా రిటయిర్డ్ లైఫ్ గడుపుతున్న వాళ్ళకి బర్డెన్ కాకూడదని. అలా అని హనీష్‌కి ఇవన్నీ చెప్పి బాధ పెట్టదలుచుకోలేదు.

గేరీతో చెప్పాను.

"విన్సీ వెళ్ళిపోయింది కదా! నా రూముకి వచ్చెయ్. నేను హాల్‌లో పడుకుంటాను" అన్నాడు.

నాకు ఒక్కసారిగా లోకం గిరగిరా తిరిగినట్లు అనిపించింది. పరదేశంలో, ఒక పరదేశస్తుడితో నేను రూమ్మేట్‌గా వుండడమా? ఈ విషయం వసుంధరకి తెలిస్తే? నాన్నకి మళ్ళీ స్టంట్ పడితే..? అని ఆలోచించాను.

"అదెట్లా కుదురుతుంది?" అన్నాను.

"లుక్.. నీనా నీకు సబ్‌లెట్ చేసింది. ఆమెకి ఇప్పుడు నువ్వు వుండడం ఇష్టంలేదు. నీకు ఖాళీ చెయ్యడం తప్ప ఆప్షన్లేదు" అన్నాడు.

నేను ఆమె సర్దుకుంటుందేమో అనుకున్నాను. కానీ రోజు రోజుకీ గొడవ ఎక్కువ చేసింది. ఒక రోజు "నా షాంపూ నువ్వు వాడుతున్నావు అందుకే అయిపోయింది" అంది.

నాకు చాలా బాధేసింది.

ఇంకోరోజు "చాలా ఖరీదైన నా పెర్ఫ్యూమ్ బాటిల్ కనిపించడంలేదు, నువ్వు తీసావా? నిజం చెప్పు" అంది.

"ఛీ! నేను అలాంటి పనులు చెయ్యను" అన్నాను.

ఆమెకి తల్లి ఫోన్ చేసినా గొడవే. ఇష్టం వచ్చినట్లు చిన్నా పెద్దా లేకుండా మాట్లాడ్తుంది.

ఎవరి పిల్లల గురించయినా చెడుగా వింటే వసుంధర ఎప్పుడూ "పెంపకం సరిగ్గా లేకపోతే అంతే" అంటూ వుంటుంది. . ఇప్పుడు ఆ మాట నిజమే అనిపిస్తోంది.

చిన్నప్పటినుండీ ఇంట్లో ఎవరి మనసూ గాయపడేట్లు అవమానించకు, ఎవరినీ పరుషంగా ఏమీ అనకు, ఇతరుల వస్తువులు అడగకుండా వాడకు, అబద్ధాలు చెప్పకు, ఎంత సహనాన్ని పరీక్షించినా, ఫిజికల్‌గా వయొలెంట్ అవకు అని తల్లి తండ్రులే నేర్పిస్తారు. కూర్చో పెట్టి చెప్పరు ఆ మోస్తరు కథలు చెప్పడం, లేదా ఎదురింటి, పక్కింటివాళ్ల మీద పెట్టి ఇలాంటి నీతి బోధలు చేస్తారు. కొంత వారి ప్రవర్తన చూసి మనం నేర్చుకుంటాం.

చిన్న బాలశిక్షా, నీతి కథలూ, సుమతీ శతకాలూ, బామ్మలూ, అమ్మమ్మలూ ఎందుకు చెప్తారో అర్థం అయింది.

పరీక్షల సమయం వచ్చింది. ఆ టైములో చదువుకోడానికి లేకుండా జెన్ నేనున్నా సరే ఇంటికి వచ్చేస్తూ వుండడం, నేను వున్నానన్న స్పృహలేకుండా వాళ్ళు విచ్చలవిడిగా వుండడంతో నాకు అస్సలు చదువుకోడానికి కుదరట్లేదు.

ఒకరోజు నీనాని "కొన్ని రోజులు నీ బోయ్ ఫ్రెండ్‌ని రావద్దను. నాకు పరీక్షలు అయ్యాక, నేను వేరే ఎకామిడేషన్ చూసుకుంటాను" అన్నాను.

"ఇప్పుడే వెళ్ళిపో. అతను రోజూ వస్తాడు నా ఇష్టం" అంటూ హిస్టీరిక్‌గా అరుస్తూ నా వసువులు అన్నీ తీసి విసిరెయ్యసాగింది. దెయ్యం పట్టినట్లు అరుస్తూ "నువ్వు నా వస్తువులని దొంగతనం చేసావు అని పోలీస్ కంప్లైంట్ ఇస్తాను ఇప్పుడే" అంది.

ఆట్లాంటి అవమానాలు పొందడానికా నేను ప్రేమించే అమ్మా నాన్నల్నీ, తమ్ముడినీ వదిలిపెట్టి ఇంతదూరం వచ్చింది అని. ఏడుపొచ్చేసింది.

వివేకానందా అంకుల్‌కి కాల్ చేసాను. లిఫ్ట్ చెయ్యలేదు. ఆంటీకి చేసాను ఆవిడకూడా తియ్యలేదు. గుర్తొచ్చింది కూతురూ అల్లుడితో, మనవలతో క్రూయిజ్ ట్రిప్‌కి వెళ్తాం అని లాస్ట్ టైం వెళ్ళినప్పుడు చెప్పారని. అక్కడ నెట్‌వర్క్ వున్నట్లు లేదు.

ఆ రాత్రి వరండా మెట్లమీద ఏడుస్తు కూర్చున్నాను. చలి ఎముకలు కొరికేస్తోంది. ఆ టైములో గేరీ ఫోన్ చేసాడు. బావురుమని ఏడ్చేసాను.

మరునాడు ఒక యూహాల్ వ్యాన్ తీసుకొచ్చి, నా లగేజ్ అంతా తన ఇంటికి తరలించేసాడు గేరీ. ఇదంతా హనీష్‌కి భయపడ్తూనే ఫోన్ చేసి చెప్పాను "అమ్మా నాన్నకి చెప్పకు. నేను తొందరలో ఇక్కడనుండి వెళ్ళిపోతా" అన్నాను.

"నో ప్రోబ్లెం. బావుంటే వుండు. ఎంవరికీ సంజాయిషీలు ఇవ్వక్కరలేదు. తొందరో నీకు ముప్పై వస్తాయి. యూ ఆర్ ఏన్ ఎడల్ట్" అన్నాడు హనీ.

గేరీ నిజంగానే చాలా మంచివాడు.

నాకు చదువుకోడానికి బెడ్ పక్కనే టేబుల్ లైట్, అన్నీ ఏర్పాటు చేసాడు.

నేను వంట చేస్తూ మసాలా వాసనలొస్తాయేమోనని భయపడితే, "వెరీ నైస్ స్మెల్" అని టమాటా పప్పూ, ఆలూ ఫ్రై తిని మెచ్చుకునేవాడు. ఎటొచ్చీ కారం వెయ్యకూడదు. దోశ అంటే చాలా ఇష్టం.

నా చదువు బాగా సాగుతోంది. గేరీ క్లాసులో అర్ధం కాని విషయాలని చాలా బాగా ఎక్స్‌ప్లెయిన్ చేసేవాడు. సర్రియలిజం గురించి నాకు చెప్పి, అలాంటి ఒకటి రెండు మూవీస్ కూడా వెతికి చూపించాడు. కంబైండ్ స్టడీస్ బాగా సాగుతున్నాయి.

డోరతీ, జోహన్ అతని ఫ్రెండ్స్ వస్తూ ఉంటారు. పరీక్షలయ్యాక ఒక రోజు అంకుల్ ఫోన్ చేసారు.

"ఏమ్మా ఎలా వున్నావ్?" అన్నారు.

"బాగున్నాను అంకుల్" అన్నాను.

"ఆంటీకి ఏం బాలేదమ్మా, మొన్న కొంచెం సీరియస్ అయి, హాస్పిటల్‌కి తీసుకెళ్తే ఒక స్టంట్ పడింది. కొన్నాళ్ళు ఇల్లు ఎయిర్ బి అండ్ బీకి ఇచ్చేసి మా అమ్మాయి దగ్గరకి నార్త్‌కెరోలినాకి వెళ్ళిపోవాలి అనుకుంటున్నాం. ఒకసారి వచ్చి వెళ్ళు" అన్నారు.

నేను వాళ్ళు వచ్చాక, నా పరిస్థితి చెప్పి కొన్నాళ్ళు వాళ్ళింట్లో వుందామా అనుకున్నాను. ఆ డోర్ క్లోజ్ అయిపోయింది.

సండే ఆంటీని చూడడానికి వెళ్ళాను.

చాలా బలహీనంగా వున్నారు.

"వీణకి అమ్మాయి దగ్గరకి వెళ్ళడం అస్సలు ఇష్టం లేదు. కానీ పిల్లలు అడిగినప్పుడు వెళ్ళాలి. మా మనవడు 'ఎబ్' పెద్ద వాడయితే, వాడికీ అమ్మమ్మా, తాతలతో కొన్ని మధుర జ్ఞాపకాలుండాలిగా" అన్నారు అంకుల్.

అమ్మా నాన్నలు కూడా ఇలాగే కూతురూ, అల్లుడూ, మనవలుతో ప్రశాంతమైన లైఫ్ కోరుకుంటున్నారు. అదేదో తప్పయినట్లు వాళ్ళని నానామాటలూ అని, ఒంటరిగా వదిలేసి వచ్చేసా. గిల్టీగా అనిపించింది.

నేను రూమ్ మారినట్లు వాళ్ళకి చెప్పలేదు. ఆంటీ ఒక అల్మారా, రీడింగ్ టేబుల్ ఇచ్చారు.

అంకుల్ తరువాత రోజు నా గదికి పంపుతాను అన్నారు వాటిని.

అంకుల్ అవస్త పడ్తుంటే, నేనే వంటకి సాయం చేసాను .వాళ్ళ బట్టలు ప్యాక్ చేయడానికి కూడా సహాయం చేసి, సాయంత్రం దాకా వుండి, చీకటి పడ్తుండగా ఇంటికి వచ్చాను.

గేరీ నన్ను చూడగానే "వచ్చావా? ఇంక రావేమో అనుకున్నాను. ఫెల్ట్ వెరీ లోన్లీ" అన్నాడు.

నేను తెచ్చిన చపాతీలూ, పప్పూ అతనికీ పెట్టి, కాసేపు ఇండియన్ ఫ్యామిలీ సిస్టం, సెంటిమెంట్స్ గురించి మాట్లాడాను.

"ఐ లవ్ దట్. మనం మంచి సినిమా తీద్దాం" అన్నాడు.

"అన్నట్లు మర్చిపోయా రేపు నేను ఊళ్ళో ఉండను.ఒక జాపనీస్ ఫ్రెండ్‌తో కలిసి శాన్‌ఫ్రాన్సిస్కో వెళ్తున్నాను ట్రెక్కింగ్‌కి. "

"సరే" అన్నను.

మరునాడు అతను వెళ్ళిపోయాడు. లాంగ్ వీకెండ్ వచ్చింది. ఇంట్లోనే వున్నాను.

ఫోన్ మోగుతుంటే, అమ్మకానీ నాన్నకానీ, హనీష్ కానీ అనుకున్నాను. కానీ అది పరి నుండి.

"లవ్.. ఎలా వుంది నీ చదువు?" అంది.

"బాగానే వుంది" అన్నాను.

"హనీ చెప్పాడు ఎవరో అమెరికన్‌తో కలిసి వుంటున్నావుటగా? ఫరవాలేదా?" అంది.

నేను కంగారుపడుతూ"నీకు చెప్పేసాడా?" అన్నాను.

"నేను మా అమ్మా నాన్నకి చెప్పనుఇలే" నవ్వింది.

"నీకో గుడ్ న్యూస్ చెప్పాలనుకుంటున్నాను" అంది.

"ఏమిటది?" అన్నాను.

"ఎవ్లిన్ నేనూ డివోర్స్ తీసుకోబోతున్నాం, తన నీడ్స్ అన్నీ కంప్లీట్ అయ్యాయి. ధీరజ్‌కి చెప్పేసాను" అంది.

తీగ తెగిన వీణ రాగాలు పలుకుతుందా?

"ధీరజ్ ఏమన్నాడు?"

"అతను నాకు దూరం అవుతాడని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఎందుకంటే నామీద అతనికి నమ్మకం వుంది. అతని ప్రేమమీద నాకు నమ్మకం వుంది" అంది.

"ప్రేమ.. అది రియాల్టీలో సంభవమేనా? ఫాంటసీ కాదా?" అపనమ్మకంగా అడిగాను.

"సంభవమే. లవ్ అనేది లేకపోతే ఇన్ని జంటలు ముసలి వయసు వచ్చేదాకా ఇలా కలిసి వుండరు. ముఖ్యంగా ధీరజ్‌లాంటి సెంటీలు" అని నవ్వింది.

చాలా ధీమా కనిపించింది దాని గొంతులో. ఆ రాత్రి ద్వారకకి ఫోన్ చేసి, నేను గేరీతో ఒకే ఇంట్లో వున్నాను అని చెప్పి, అతని రియాక్షన్ చూడాలని ఎంతగానో అనిపించింది.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS